# ఆంధ్రప్రదేశ్ డెక్కన్ ప్రాంతం వర్షాధార రైతుల నుండి వాతావరణ సంక్షోభం గురించి నివేదిక

ఆంధ్రప్రదేశ్ మెదక్ జిల్లా జహీరాబాద్ ప్రాంతంలోని వర్షాధార వ్యవసాయం చేసే రైతులైన మేము ఏడు రోజులు మీటింగు పెట్టుకుని, పి.ఆర్.ఎ ద్వారా వాతావరణంలో మార్పు, దాని ప్రభావంతో మా వ్యవసాయం, జీవనోపాధులలో వస్తున్న మార్పులను వివరంగా చర్చించుకున్నాము. మా బలం మా వ్యవసాయం చాలా అరుదైనది. కొద్దిపాటి చిన్న కమతాలలోనే మేము మూడు నుండి 10 రకాల వరకు పంటలను పండిస్తాము. ఇవి తరతరాల నుండి మాకు అందిన విజ్ఞానం, మా అమూల్య సంపద.

మేము పండించే పంటలు మేము అనుసరించే వ్యవసాయ పద్ధతులకు ఎక్కువ ఎండను, తక్కువ వర్షపాతాన్ని తట్టుకునే శక్తి ఉంది. అందువలన మా వ్యవసాయ పద్ధతిని కొనసాగిస్తే మేము ఏ వాతావరణ వైపరీత్యాన్నయినా తట్టుకుని నిలబడగలము.

## ఈ చర్చ ద్వారా మేము తెలుసుకున్న సత్యాలు ఇవి

+ పెద్దగా పెద్దగా సారం లేని ఎర్ర భూములలో, రేగడి నేలల్లో ఎన్నో వందల సంవత్సరాల నుండి మేము రకరకాల పంటలు పెట్టుకుంటూ వస్తున్నాము. దీంట్లో జొన్నలు, సజ్జలు, కొర్రలు, సామలు, తైదలు, తొగాళ్ళు, అనుములు, బెబ్బర్లు, ఉలవలు, గడ్డినువ్వులు మొదలైన 80 కన్నా ఎక్కువ రకాల పంటలు కలిపి సాగు చేస్తున్నాము.
+ మేము పండించే ప్రతి పంట రకంలో ఎన్నో రకాల పోషకాలు ఉంటాయని మాకు తెలుసు. ఇవి మా తిండిలో ముఖ్యం. వందల సంవత్సరాలుగా వీటిని తింటున్న మా పెద్ద వాళ్ళు, వయస్సులో ఉన్నోళ్ళు రోగాలు లేకుండా బతికిందే కాకుండా బరువు పనులను కూడా చేయగలిగినారు.
+ ఈ మన తిండి పద్ధతి మనల్ని కరువు కాలంలో కాపాడింది. మండేటి ఎండలో సల్వని ఇచ్చింది. చలికాలంలో మా పెయ్యికి వేడిని ఇచ్చింది.
+ మేము ఏడు రోజులు చర్చలలో వాతావరణ వైపరీత్యం గురించి మాట్లాడుకున్నాము. మేము అర్థం చేసుకున్న ప్రకారం దీని వల్ల మూడు దుష్పరిణామాలు పొంచి ఉన్నాయి.
  అ) పెరిగే ఎండ
  ఆ) ఎక్కువ తక్కువ అయ్యే వానా కాలం
  ఇ) పోషకలోపం
  ఈ మూడు పరిణామాలను తట్టుకునే శక్తి మా పంట పద్ధతిలో ఉన్నదని ధృడంగా నమ్ముతున్నాము.
+ మా వ్యవసాయంలో ఉన్న జీవవైవిధ్య బలంతోని, మా తెలివి మాకిస్తున్న గుండె ధైర్యంతోని, మేము ఏ పరిస్థితిని అయినా తట్టుకుంటాము అనే నమ్మకం మాకు ఉంది.
+ మా వ్యవసాయంలో ఉన్న పంటలే కాకుండా మా చుట్టు పక్కల ఉన్న అడవుల్లో గౌటాను భూములల్లో ఎన్నో రకాల చెట్లు చామలు నీళ్ళకు ఆశపడకుండానే మొలుస్తాయి., పెరుగుతాయి. సీతాఫల్, చిట్‌మిటి, బలుసురు, అల్లనేరెడి, మొర్రి, ఇల్లింత, ఈత, కాకి, రేణి, మేడి, పుల్‌చరి, ఇంకా ఎన్నెన్నో రకాల పండ్లు ఫలాలు మాకు ఒక్క పైసా ఖర్చు లేకుండా దొరుకుతాయి.

  మా వ్యవసాయం మందు లేని వ్యవసాయం, కాబట్టి మా చేన్లలో ఎన్నో రకాల ఆకుకూరలు వాటంతట అవే మొలుస్తాయి.

  ఇవి రెండు మన వ్యవసాయ పద్ధతిలో చాలా ముఖ్య భాగంగా పని చేసి, పైసా ఖర్చు లేకుండా మనకు ఎన్నో రకాల పోషకాలను అందిస్తాయి.
+ మన వ్యవసాయంలో చాలా ముఖ్యమైన ఇంకొక భాగం మన పశువులు. వీటితో మనకు ఇంటికి కావలసిన పాలు, పెరుగు, కాకుండా మా చేన్లని దున్నడానికి మా వ్యవసాయానికి కావల్సిన ఎరువులు కూడా దొరుకుతాయి. ఈ పశువులు మా వ్యవసాయానికి ఒక పెద్ద మద్దతే కాకుండా వాతావరణ తేడాని తట్టుకునే శక్తిని మా వ్యవసాయానికి అందిస్తాయి.
+ మన వ్యవసాయంలో మేము ఏ విధమైన రసాయన ఎరువులను కాని, పురుగు మందులని కాని వాడము. ఎక్కడ ఇటువంటి ఎరువులు, మందులు వాడతారో అక్కడ పర్యావరణానికి చాలా హాని కలిగిస్తారని మాకు తెలుసు. దీనికి విరుద్ధంగా మన మందులేని వ్యవసాయం పర్యావరణాన్ని రక్షిస్తుంది / పెంచుతుంది.

+ మనం ముందే చెప్పినట్లు మన వ్యవసాయంలో ఎన్నో రకాల కలిపి పంటలు ఉంటాయి. మా భూమికి మేము పెంట ఎరువు వేస్తాము, జర్రెల ఎరువు కలుపుతాము, ఆకు అలాలని కూడా వేస్తాము. ఈ విధంగా మేము మా మట్టిలో చాలా రకాలైన కార్బన్‌ని కలుపుతామని తెలిసినవారు, మాకు తెలుపుతుంటార్లు దీంతో వాతావరణ మార్పుని అడ్డుకునే పోరాటంలో మేము ఒక పెద్ద పాత్రని పోషిస్తున్నామని కూడా తెలిసినవారు చెబుతున్నారు.

+ ఇటువంటి శక్తి గల వ్యవసాయాన్ని విడిచి పెట్టి మీరు, జన్యుమార్పిడి పంటలు వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటాయనే తప్పుడు ప్రచారానికి లోబడి వాటిని ప్రోత్సాహిస్తే మనం అందరం ఒక పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొంటామని మీ దృష్టికి తెస్తున్నాము.

## మా కోరికలు

పైన తెలిపిన మన వ్యవసాయ పద్ధతిలోని అన్ని రకాల ప్రయోజనాలు, బలాన్ని గుర్తుంచుకుని రాష్ట్ర ప్రభుత్వం, భారత ప్రభుత్వం, అంతర్జాతీయ సమాజాన్ని మేం కోరేది ఇదే: –

+ మా వ్యవసాయాన్ని వ్యవసాయంగా చూడండి, వాతావరణ సంక్షోభానికి సమాధానం ఇచ్చే దాని బలాన్ని సత్తువని గుర్తించండి, దాని కేవలం పైసలు సంపాదించే సాధనంగా చూసే మీ అభిప్రాయాల్ని మార్చుకోండి.

+ ఈ వ్యవసాయాన్ని ముందుకు తీసుకుపోయే బాధ్యత మాతో పాటు మీ అందరి మీదా ఉంది. మీరు రసాయన ఎరువు వేసేటోళ్ళకి, పురుగు మందు వాడేటోళ్ళకి, కాల్వ నీరు వాడేటోళ్ళకి, లక్షల కోట్ల రూపాయల సబ్సిడీని ఇస్తున్నారు. దాన్ని బంధు చేసి మా లాంటి వ్యవసాయం చేసేటోళ్ళని ప్రోత్సాహించేది మీ ధర్మం.

+ మా వ్యవసాయం ద్వారా మేము ప్రపంచానికి నీళ్ల ఆదా చేస్తాము, బలమైన తిండి అందిస్తాము, ఆరోగ్యమైన వాతావరణాన్ని నిలబెడతాము. పశువులకి మంచి మేత పండిస్తాము. మేము భూమికి కార్బన్‌ని మళ్లీ చేరేలా చూస్తాం. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని మా లాంటి రైతులకు ప్రతి పంట సీజన్‌కి ఎకరానికి రూ. 2000 లు గౌరవ వేతనాన్ని మీరు అందివ్వాలి. దీని ద్వారా మా విలక్షణమైన వ్యవసాయ పద్ధతికి ప్రోత్సాహం లభిస్తుంది. అందరూ ఆ పద్ధతికి వస్తారు.

+ మా వ్యవసాయం ఒక బొట్టు పారకం నీళ్ళు లేకుండానే నడుస్తదని మీ దృష్టికి తీసుకు వస్తున్నాము. ఇటువంటి వ్యవసాయాన్ని పారకంతో బియ్యం పండించే రైతులతోని పోలిస్తే మేము ప్రతి ఎకరానికి లక్షల లక్షల లీటర్ల నీళ్ళని పొదుపు చేస్తున్నాము. దీన్ని కూడా మీరు గుర్తిస్తారని మా ఆశ.

ఈ అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకుని మా వ్యవసాయ పద్ధతి ద్వారా వాతావరణ మార్పు నుంచి వచ్చే పరిణామాలని ఎదుర్కొంటామని ధైర్యంగా ఉన్నాము.

ఇంకా చాలా మంది రైతులు మాలాగానే వ్యవసాయం చేస్తారు. ఇవన్నిటి వల్ల వాతావరణ మార్పుని మేము మంచిగా ఎదుర్కోగలుగుతాము.

+ మా ఆహార పద్ధతిలో ముందే చెప్పినట్లు ఉత్త పంటలే కాదు, పండ్లు, ఫలాలు కూడా కలిగి ఉన్నాయి. వీటిని బజారు సరుకుగా మార్చే బదులు దాని మీద మా స్వంత కంట్రోలు ఉండేటట్టు మీరు చూడాలి.

## దీని కోసం మీరు చేయాల్సిన చర్యలు ఇవి

+ గౌటాన్ భూమిల రోడ్డు పక్కలల్ల ఉన్న పండ్ల చెట్లను గుత్తేదార్లకి అమ్మకుండా మేము మా పిల్లలు ఖర్చు లేకుండా తినే స్వాతంత్ర్యం కల్పించాలి. ఇటువంటి చెట్లని మా పొలాల చుట్టు, ఉమ్మడి భూములలో పెంచడానికి కావల్సిన సహాయాలను అందివ్వాలి.

+ అడవుల పెంపకం, చెట్లు పెంపకం పనులని గుత్తేదార్లకి, కంపెనీలకు అప్పచెప్పకుండా గ్రామాలకే అప్పచెప్పాలి. దాంట్లో ఒకటే రకమైన, పైసలు సంపాదించే చెట్లు కాకుండా మా తిండికి, వంట చెరకుకు, మేతకు పనికి వచ్చే చెట్లను పెంచటానికి మాకు సహాయం చేయాలి.

+ పండ్ల చెట్లు పెంచే ప్రభుత్వ కార్యక్రమాలలో రసాయన ఎరువు, పురుగు మందు, నీళ్ళు ఆశించే చెట్ల బదులు మన దేశీ చెట్లని, దేశీ పండ్లని ప్రోత్సాహించాలి.

మన దేశీ చెట్లు, మన ఉమ్మడి భూములు జీవవైవిధ్య పరమైన అడవులను పెంచి, కాపాడకుండా జట్రోపా (అడవి ఆముదం) చెట్లు వేసి మనుషులకు తిండి బదులు బండ్లకి పెట్రోలు దొరికించే ప్రయత్నం మీరు చేస్తే అది పేద ప్రజలకి, పర్యావరణానికి ద్రోహం చేసినట్టు అవుతుందని మేము తెలియ చేస్తున్నాము.

+ మన వాతావరణానికి తట్టుకోలేని విదేశీ పశు జాతులను ప్రోత్సాహించే బదులు ఇక్కడి పరిస్థితుల్లో, తక్కువ గ్రాసం, నీటితో బతికే దేశీ రకాలను గుర్తించి ప్రభుత్వ పశుసంవర్ధక కార్యక్రమాలలో ప్రోత్సాహించాలి.

+ మా భూములు, పంటలు, చెట్లు, పశువులపై మాకు ఎంత నమ్మకం విశ్వాసం ఉన్నాయో, మా విజ్ఞానం, నేర్పు పట్ల ప్రభుత్వానికి తిరుగులేని నమ్మకం ఉండాలని మేము ఆశిస్తున్నాం. అప్పుడే మనం కలిసి ఈ వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోగలం

+ మా వ్యవసాయ పద్ధతులు, విజ్ఞానంలోని మంచిని ఉపయోగాలని గుర్తించే వివేకం ప్రభుత్వాలకు ప్రపంచ దేశాలకు ఉందన్న నమ్మకం మాకు ఉంది. ప్రపంచ వ్యాప్తంగా లాభమే ధ్యేయంగా ఉన్న సంస్థల పెత్తనానికి లొంగకుండా వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు, తన బలాన్ని ఉపయోగించాలన్నది మా కోరిక.

**డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీమహిళా సంఘాలు**
**పస్తాపూర్ గ్రామము, జహీరాబాగ్ మండలం**
**మెదక్ జిల్లా – 502 220**
**ఫోన్ నెం. 08451-282271, 282785**